వైభవంగా గోదాదేవి కల్యాణం

గిర్మాజీపేట : బట్టలబజార్‌లో గోదారంగనాయకుల కల్యాణం చేస్తున్న అర్చకులు

వరంగల్ చౌరస్తా/గిర్మాజీ పేట/ చెన్నారావుపేట/ఖానాపురం/రాయపర్తి, జనవరి 13 : జిల్లా వ్యాప్తంగా సోమవారం పలు ఆలయాల్లో గోదాదేవి-రంగనాథస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గిర్మాజీపేట గోవిందరాజస్వామి ఆలయం, రామన్నపేట బట్టల బజార్‌లోని బాలానగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, చెన్నారావుపేట మండలం లింగగిరిలలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం, ఖానాపురంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, బుధరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, రాయపర్తి మండలంలోని సన్నూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాన వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

చింతల్‌లో ముగ్గుల పోటీ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీదేవి

వరంగల్ చౌరస్తా, జనవరి13 : సంక్రాంతిని పురస్కరించుకుని ఆడెపు ఫౌండేషన్ చైర్మన్ ఆడెపు వెంకటేష్ ఆధ్వర్యంలో చింతల్ భక్త హనుమాన్ దేవాలయంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కటకం శ్రీదేవి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళా పరపతి సంఘానికి రూ.5లక్షల విరాళం

మహిళా సంఘానికి విరాళం అందజేస్తున్న లక్ష్మీనారాయణ-గీత దంపతులు

గీసుగొండ, జనవరి 13 : మండల కేంద్రంలో గీతా లక్ష్మీ నారాయణ మహిళా పరపతి సంఘానికి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ గీత, లక్ష్మీనారాయణ దంపతులు రూ.5లక్షల విరాళం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి తమ వంతుగా విరాళం అందజేసినట్లు తెలిపారు. సంఘం అధ్యక్షురాలు కర్ణకంటి రజిత, కోశాధికారి హేమలత, సభ్యులు సుజాత, కోల రజిని, భవాని, యూకుబీ, స్రవంతి, శ్రీలత పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

చెన్నారావుపేట, జనవరి 13: మండల కేంద్రానికి చెందిన యాట అజయ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వైద్యం చేయించుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలిసిన అతడి స్నేహితులు సోమవారం యాట అజయ్‌ను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.20వేల నగదును అందించారు. అలాగే, మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి చిరుతం సాయిరాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కళాశాలకు చెందిన అధ్యాపకులు పరామర్శించి, రూ.17వేలు అందజేశారు.



ఖిలావరంగల్ : శివనగర్‌లో భోగి మంటలు వేస్తున్న స్థానికులు

నర్సంపేట : అయ్యప్ప ఆలయంలో భోగి మంటలు వేస్తున్న భక్తులు

ఘనంగా భోగి వేడుకలు

సంగెం : మొండ్రాయిలో ఇంటి ముందు ముగ్గువేస్తున్న యువతి

- రంగువల్లులతో మురిసిన పల్లెలు
- ఆకట్టుకున్న భోగీ మంటలు

వర్ధన్నపేటలో గంగిరెద్దుకు కానుకలు సమర్పిస్తున్న మహిళలు

వర్ధన్నపేట/సంగెం/ఖిలావరంగల్/నర్సంపేట, జనవరి 13 : జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో భోగీ సందర్భంగా మహిళలు ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే, గంగిరెద్దులను ఆడిస్తూ ఇండ్ల ముందుకు వచ్చిన వారికి నమస్కరించి కానుకలను సమర్పించారు. పండుగకు ఆడపడుచులు, బంధువులు రావడంతో ఇండ్లు సందడిగా మారాయి. అలాగే, రాత్రి వీధుల్లో భోగీ మంటలు వేసుకొని పాటలకు మహిళలు, పిల్లలు నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. వరంగల్ శివనగర్‌తోపాటు నర్సంపేటలోని అయ్యప్ప స్వామి ఆలయంలో భోగి మంటలు వెలిగించి, సంబురాలు జరుపుకున్నారు. అలాగే భోగి, ఆరుద్రనక్షత్రం, పౌర్ణమి తిథి ఉండడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

నెక్కొండ, జనవరి 13 : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ సోమవారం తెలిపారు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5.6 అడుగులు, ఎడమ పక్క ఒంటిపై పుట్టు మచ్చ ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

మోహన్ (ఫైల్)

నర్సంపేట, జనవరి 13 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ఆశ్వాపురం మండలం మెట్టుగూడకు చెందిన వల్లాల మోహన్ (65) బతుకుదెరువు నిమిత్తం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రామవరంలోని బంధువుల ఇంటికి 15 ఏళ్ల క్రితం వచ్చాడు. రామవరంలో జినుకల సుదర్శన్ వద్ద ఉంటూ దొరికిన కూలీ పనులకు వెళ్తున్నాడు. ఆదివారం సాయంత్రం పని నిమిత్తం మోహన్ నర్సంపేటకు వచ్చి, ఆటోలో తిరిగి వెళుతున్నాడు. మహేశ్వరం శివారు బిట్స్ సమీపంలో ఆటో దిగి రోడ్డు దాటుతుండగా దుగ్గొండి మండలం మహ్మదాపురానికి చెందిన అరుణ్‌రెడ్డి బైక్‌పై అజాగ్రత్తగా వచ్చి మోహన్‌ను ఢీకొట్టాడు. దీంతో మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అదే రోజు రాత్రి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మోహన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి బంధువు జినుకల సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు.

రుద్రగూడెంలో క్షుద్ర పూజలు

నల్లబెల్లి, జనవరి 13 : రుద్రగూడెంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించారు. ఓ వీధిలో బొమ్మను ఏర్పాటు చేసి పసుపు, కుంకుమలు చల్లి, నిమ్మకాయలు వెదజల్లి పూజలు చేసినట్లు గ్రామస్తులు గమనించారు. భయాందోళనకు గురై పోలీసులకు చెప్పడంతో ఎస్సై గోవర్ధన్ సిబ్బందితో వచ్చి, వాటిని తొలగించారు. మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

పెద్ది సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

నల్లబెల్లి, జనవరి 13 : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలిశారు. సంక్రాంతిని పురస్కరించుకుని నల్లబెల్లి మండల కేంద్రంలోని పెద్ది నివాసంలో పార్టీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకుడు నల్లా మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ దేవోజు సదానందం, రామసహాయం సుధాకర్, గందె చంద్రమౌళి, బీఆర్ఎస్ కేవీ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వెన్నుముద్దల శీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండి రమేశ్, మండల శ్రీనివాస్, పెండెం వెంకటేశ్వర్లు, చుక్క అనిల్, మద్దెల సాంబయ్య, పెకుమాండ్ల రవి, శివరాత్రి స్వామి, దేవోజు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా చేయాలని సబ్‌స్టేషన్ ముట్టడి

ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నల్లబెల్లి, జనవరి 13 : విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబెల్లి మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను ప్రజాసంఘాల నాయకలు సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ మాట్లాడుతూ మండలంలోని ముచ్చింపుల గ్రామంలో 25 రోజుల నుంచి వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పేరుతో రోజు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, దీంతో రైతులు పంటలకు సాగు నీరందించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అనేకసార్లు అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ముచ్చింపులలో వీధి లైట్ల ఏర్పాటుతో పాటు కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, విషయం తెలుసుకున్న ఏఈ హరిబాబు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు బట్టు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట/కరీమాబాద్, జనవరి 13 : ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డప్పు కళాకారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు అబ్బదాసి యాకయ్య కోరారు. వెయ్యి గొంతులు, లక్ష డప్పులు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్ ఆదేశం మేరకు సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మేకల సదానందం, ఒంటరి రాములు, కొమురయ్య, జన్ను సాంబయ్య, గన్నారపు మల్లయ్య, మాదాసి సారయ్య, భిక్షపతి, మేకల దయాకర్, సుంకరి రాజు, రాకేశ్ పాల్గొన్నారు. అలాగే, గ్రేటర్ 43వ డివిజన్ తిమ్మాపూర్‌లో జరిగిన సమావేశంలో పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ 'లక్ష డప్పులు -వేల గొంతుకల' మాదిగ కళాకారుల మహా సాంస్కృతిక ప్రదర్శనకు ప్రతి దళితబిడ్డ తరలిరావాలని కోరారు.

కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని వ్యతిరేకించాలి

ఖిలావరంగల్, జనవరి 13 : కేంద్ర ప్రభుత్వ నూతన కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని వ్యతిరేకించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు అన్నారు. సోమవారం ఖిలావరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం, రైతులు గతంలో చేసుకున్న ఒప్పంద పత్రాలను రైతు సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధర హక్కు చట్టం చేయాలని జాతీయ రైతు సంఘం నాయకులు జగ్జీత్‌సింగ్ 50 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి, బైరబోయిన ఎల్లయ్య, మైదం పాణి, ఇనుమల కృష్ణ, ఎండీ అక్బర్, సుద్దాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలు అదుర్స..

- నర్సంపేటలో పాడి పశువుల విన్యాసాలు
- అందంగా ముస్తాబు చేసి తీసుకొచ్చిన యజమానులు
- అలరించిన ఆవులు, గేదెలు, పొట్టేళ్లు, కుక్కలు, కోళ్లు
- విజేతలకు నగదు, షీల్డ్ అందజేత

ప్రదర్శనలో విన్యాసాలు చేస్తున్న మేక పోతులు

నర్సంపేట, జనవరి 13 : పాడి పశువులు అందంగా ముస్తాబై వచ్చాయి.. మా అందం చూడమంటూ పోటీల్లో పాల్గొన్నాయి. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శాంతిసేన రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పాడి పశువుల అందాల పోటీలు నిర్వహించారు. నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పాడి పశువులను ఆకర్షణీయంగా తయారుచేసి పెద్ద ఎత్తున యజమానులు తీసుకొని వచ్చి ప్రదర్శనలో పాల్గొన్నారు. ముఖ్యంగా జోడెడ్లు, ఆవులు, గేదెలు, గొర్రె, మేక పోతులు, కుక్కలు, దూడలు, కోడి పుంజులు ప్రజలను అలరించాయి. న్యాయ నిర్ణేతలు పరిశీలించి ఉత్తమమైన వాటిని ఎంపిక చేశారు. తొలుత అందాల పోటీలను ప్రారంభించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అనంతరం విజేతలైన పాడి పశువుల యజమానులకు నగదు, షీల్డ్‌లు అందజేశారు.

అందాల పోటీలో పాల్గొన్న పశువులు, పక్షులు

విజేతలు వీరే...

జోడెడ్ల విభాగంలో వరంగంటి సురేందర్, మేకల అశోక్, గుళ్లపెల్లి చిన్న, ఆవుల విభాగంలో గొల్ల పూడి కృష్ణ, సాదుల ముత్తిలింగం, చింతల నరేందర్, గేదెల విభాగంలో తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, నమిండ్ల రాజేందర్, చీర చేరాలు, గొర్రె పోతు విభాగంలో జట్టంగి రాజేశ్వరి, జట్టంగి రాజ్‌కుమార్, మేక పోతు విభాగంలో వేల్పుల వీరభద్రస్వామి, పులి రాజు, ఎం జీవ న్, కుక్కల విభాగంలో వేముల రవి, అల్లెపు వంశీ, అభిలాష్, దూడల విభాగంలో నాడెం వీరన్న, కొర్ర రాంజీ, పాలాయి ప్రణయ్, కోళ్ల విభాగంలో అందె స్వామి, లోడెం పవన్, ఎల్లబోయిన సాంబయ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. ఏఈవో మెండు అశోక్, శాంతిసేన గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, పల్లె రాములు, అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి, సభ్యులు రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, చిలువేరు వెంకటేశ్వర్లు, చింతల సాంబరెడ్డి, తౌటి వెంకటనారాయణ, చిలువేరు కొమ్మా లు, ఈగ సత్యనారాయణ, లింగాల నవీన్, సూరయ్య, బొమ్మిడి కరుణాకర్, చక్రపాణి, హన్మయ్య, అశోక్, రాజమౌళి, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

ప్రభుత్వ గురుకులాల్లో చేర్పించాలి

ఖిలావరంగల్, జనవరి 13 : విలువలతో కూడిన విద్యను అందిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులను చేర్పించాలని కార్పొరేటర్ బైరబోయిన ఉమ అన్నారు. సోమవారం ఖిలావరంగల్‌లో సాంఘిక సంక్షేమ గురుకులాలు రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ గురుకులాల్లో చేరేందుకు వచ్చే నెల 1 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దాయోదర్ యాదవ్, ఉపాధ్యాయులు కడారి భోగేశ్వర్, అశోక్, పూజారి మనోజ్‌కుమార్, సారయ్య, జటబోయిన స్వామి పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న బానోత్ సారంగపాణి

చెన్నమల్ల స్మారక క్రీడలు ప్రారంభం

నల్లబెల్లి, జనవరి 13 : బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ చెన్నమల్ల నర్సయ్య స్మారక క్రీడోత్సవాలను పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి సోమవారం నారక్కపేటలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సయ్య తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారని, సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసుకురావడం కోసం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మృతుడి కుమారుడు చెన్నమల్ల చైతన్య, మాజీ సర్పంచ్ రామారావు, మాజీ ఎంపీటీసీ గుండాల రాజకొంరయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

బహుమతి అందజేస్తున్నరంగనాథస్వామి

నర్సంపేట, జనవరి 13 : మండలంలోని గురిజాల గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి వాలీబాల్, షటిల్, కబడ్డీ క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు పురోహితుడు దాస్యం రంగనాథస్వామి చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దౌడు భాస్కర్, కంకల ప్రసాద్, మెట్టు రమేశ్, గడ్డం శ్రీనివాస్, జనగాం నవీన్, అథ్లెట్ సిరిపురం మహేశ్, శెట్టి రాజు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

కరీమాబాద్, జనవరి 13 : స్పైక్ టౌన్ వాలీబాల్ క్లబ్ శంభునిపేట ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభతో ప్రథమ బహుమతి గెలుపొందిన పున్నేలు జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వాలీబాల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం అందజేస్తున్న ఉద్యమకారులు

బాధితుడికి బియ్యం అందజేత

కరీమాబాద్, జనవరి 13 : ఇటీవల 43వ డివిజన్ నక్కలపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్ తండ్రి మరణించగా తెలంగాణ ఉద్యమకారులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కేజీల బియ్యం అందజేశారు. బీఆర్ఎస్ శ్రేణులమంతా కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భూంపెల్లి జయశంకర్, యాడాల జగపతి, కలకోట్ల క్రాంతి, తేలు రాకేశ్, ఉసిల్ల కిరణ్, అంబాల ఉదయ్, గంపలపెల్లి గోవర్ధన్, సురేశ్ పాల్గొన్నారు.

అలిశెట్టి ప్రభాకర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు

చెన్నారావుపేటలో పాఖాల కవుల సమ్మేళనం

చెన్నారావుపేట, జనవరి 13 : మండల కేంద్రానికి చెందిన కవి ములుక సాంబయ్య ఆధ్వర్యంలో సోమవారం పాఖాల కవుల వేదిక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన కవి అలిశెట్టి ప్రభాకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ములుక సాంబయ్య మాట్లాడుతూ కవిత్వం మనిషిని ఉన్నతుడిగా తీర్చి దిద్దుతుందన్నారు. కార్యక్రమంలో కవులు బండారి రాజ్‌కుమార్, యాకూబ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, కుమార స్వామి, వడ్లకొండ దయాకర్, తండ హరీశ్, కార్తీక రాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పర్వతగిరి, జనవరి 13 : మండలంలోని కొంకపాక శివారు సోముల తండాలో అప్పుల బాధతో కౌలు రైతు వెంకన్న ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే, గోపనపెల్లిలో బాద ఉప్పలయ్య, నాంపెల్లి రాజయ్య, దూడయ్య, కొంకపాకలో గంధం సాయిలు మృతిచెందగా బాధిత కుటుంబాలను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పిన్నింటి అనిల్‌రావు, జాటోత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

రాయపర్తి, జనవరి 13 : మండలంలోని బాధిత కుటుంబాలకు మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూతనందించారు. శివరామపురం(ఆర్‌అండ్‌ఆర్ కాలనీ) గ్రామానికి చెందిన నాగపురి శ్రీనివాస్, కొండూరుకు చెందిన గంగారపు ముత్తమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు సోమవారం 50 కేజీల బియ్యంతోపాటు 15 లీటర్ల వంట నూనె, నిత్యావసర వస్తు సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి భూక్యా సురేందర్ రాథోడ్‌నాయక్, బీఆర్ఎస్ మండల నాయకులు రంగు కుమార్, పూస మధు, కర్ర రవీందర్‌రెడ్డి, దేశగాని ఉపేందర్, పెండ్లి వెంకన్న, చెడుపాక కుమారస్వామి, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, నాగపురి సోమయ్య, భూక్యా జగన్, చెడుపాక యాకయ్య, వీరస్వామి, ప్రభాకర్, అశోక్, రవి పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు